క్లుప్తంగా

చిన్నారిని ఆశీర్వదించిన జెడ్పీ చైర్‌పర్సన్



చిన్నారిని ఆశీర్వదిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

కురిచేడు: వైఎస్సార్ సీపీ నాయకుడు కర్నాటి వెంకటరెడ్డి మనుమరాలు సాన్విక జన్మదిన వేడుకలతో పాటు వారి నూతన గృహప్రవేశ కార్యక్రమానికి శుక్రవారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరై ఆశీర్వదించారు. ముందుగా బూచేపల్లి వెంకాయమ్మకు వెంకటరెడ్డి దంపతులు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. ఆమెతో ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. జెడ్పీటీసీ నుసుం వెంకటనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వైవీ సుబ్బయ్య, నాయకులు కాకర్ల కృష్ణారెడ్డి, డాక్టర్ బాషా, కండె గంగయ్య, ఆవుల వెంకటరెడ్డి, వీరగంధం కోటయ్య, నుసుం ప్రతాపరెడ్డి, ఎన్వీ నాగిరెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, మేరువ పిచ్చిరెడ్డి, మేరువ సుబ్బారెడ్డి, అనుపల్లి భాస్కరరెడ్డి, కసిబిసి వెంకటేశ్వర్లు, గోగులముడి లింగారెడ్డి, నారు శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, దేవసాని రామకోటిరెడ్డి, గండి సంతారావు, ఏసురత్నం, షేక్ మౌలాలి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చేతులు శుభ్రపరుచుకోవడంపై అవగాహన కల్పిస్తున్న ఎంఈవో

యర్రగొండపాలెం: పరిసరాలతోపాటు విద్యార్థులు ఎల్లవేళలా చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. స్థానిక నలంద హైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ కరస్పాండెంట్ పద్మజ ఓబులరెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

దర్శి: పరిసరాల పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.కిరణ్‌కుమారి సూచించారు. స్థానిక ఆ పాఠశాలలో శుక్రవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. చెట్లను పెంచాలంటూ విద్యార్థులు వివిధ ఆకృతుల్లో నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి పెంచాలని హెచ్‌ఎం సూచించారు. కార్యక్రమంలో పీడీ మాలకొండయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ఎన్‌సీసీ క్యాడెట్ల సైకిల్ ర్యాలీ

కొమరోలు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లు శుక్రవారం ఎన్‌సీసీ అధికారి కదిరిపోగు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల మైదానాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం అశ్వనీకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవకాశాలు అందిపుచ్చుకుని చదువులో రాణించాలి

కొనకనమిట్ల: అవకాశాలు అందిపుచ్చుకుని విద్యార్థులు చదువులో రాణించాలని డీవైఈఓ చంద్రమౌళీశ్వర్ సూచించారు. శుక్రవారం మర్రిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు ట్యాబ్‌లు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో బోధన అంశాలపై సమీక్షించారు. స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులను, హెచ్‌ఎం నాగేశ్వరరావు, పీఈటీ కోటేశ్వరిని అభినందించారు. పీఈటీని ఘనంగా సన్మానించారు.

పాపినేనిపల్లె సర్పంచ్‌గా నాగమల్లేశ్వరి

బేస్తవారిపేట: అర్ధవీడు మండలంలోని పాపినేనిపల్లె సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలైన నల్లబోతుల నాగమల్లేశ్వరి తిరిగి బాధ్యతలు స్వీకరించారు. అనారోగ్యం కారణంగా కొంతకాలంగా సర్పంచ్ బాధ్యతలకు ఆమె దూరంగా ఉన్నారు. ఆమె స్థానంలో టీడీపీ సానుభూతిపరురాలు కొమెరె అచ్చమ్మ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. డీపీఓ అచ్చమ్మను తొలగిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో శుక్రవారం నాగమల్లేశ్వరి బాధ్యతలు చేపట్టారు.

అసంపూర్తితో అసౌకర్యం

- అసంపూర్తిగా నిలిచిన కేజీబీవీ కళాశాల
- పూర్తికాని తరగతి గదులతో విద్యార్థినుల ఇక్కట్లు



పెద్దారవీడులో అసంపూర్తిగా నిలిచిన కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల

పెద్దారవీడు: నిర్మాణం ప్రారంభించి రెండేళ్లయినా అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మండల కేంద్రం పెద్దారవీడులోని కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. 2018–19లో కస్తూర్బా గాంధీ బాలికల కళాశాలకు సర్వశిక్షాభియాన్ ద్వారా రూ.1 కోటి 30 లక్షలు నిధులు మంజూరయ్యాయి. 1.5 శాతం లెస్‌తో నిర్మాణ పనులను కంట్రాక్టర్ దక్కించుకున్నారు. ప్రస్తుతం బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియెట్ బాలికలకు విద్యాబోధన కొనసాగుతోంది. 6 నుంచి పదో తరగతి వరకు 195 మంది బాలికలకు విద్యా బోధన చేయాలంటే గదులు సరిపోవడంలేదని, ఇంటర్మీడియెట్ బాలికలకు తరగతి గదులు ఇవ్వడంతో ప్రస్తుతం ఉన్న బాలికలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఎంపీసీ గ్రూపు బాలికలు 43 మంది చదువుతున్నారు. స్లాబ్ లెవల్ వరకు నిర్మాణ పనులు చేసి మిగతా పనులు చేయకుండా కాంట్రాక్టర్ నిలిపి వేశారు. తరగతి గదులు పూర్తి కాకపోవడంతో ఫిజిక్స్, కెమిస్ట్రీకి సబ్జక్టులకు సంబంధించిన ల్యాబ్‌లు లేవు. తరగతి గదులకు సిమెంటు ఇటుకలతో గోడలు పెట్టి వదిలేశారు. కిటికీలు ఏర్పాటు చేయకుండా, స్లాబ్ వేయకుండా వదిలేశారు. కాంట్రాక్టర్ రెండేళ్ల పాటు నిర్మాణ పనులు చేయకుండా నిలిపేసినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేదని ఉపాధ్యాయినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల నిర్మాణ పనులు నిలిచాయని జిల్లా, మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లానని ప్రిన్సిపాల్ పీబీ తెలిపారు. పనులు సత్వరం పూర్తయ్యేలా సంబంధిత జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు.



స్లాబ్ వేయకుండా వదిలేసిన తరగతి గదులు

నేడు చలివేంద్రలో జెడ్పీ చైర్‌పర్సన్ పూజలు

దర్శి: తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను, స్వామివారి ప్రసాదం విశిష్టతను, వెంకటేశ్వర స్వామి వైభవాన్ని, టీటీడీ పేరుప్రఖ్యాతులను, లడ్డూ పవిత్రతను కాపాడాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శనివారం చలివేంద్ర కొండపై ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రాజకీయ దుర్బుద్ధితో ఉద్దేశపూర్వకంగా లడ్డూ తయారీలో జంతువుల కొవ్వుతో కల్తీ జరిగిందని, ఆ ప్రసాదాన్ని భక్తులు తిన్నారని సీఎం చంద్రబాబు అసత్యప్రచారం చేసి తిరుమలను, తిరుమల లడ్డూను, వెంకటేశ్వరస్వామి విశిష్టతను అపవిత్రం చేశారన్నారు. చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం జరిగే పూజల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. చలివేంద్ర కొండపై జరిగే పూజా కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఆమె కోరారు.

దొనకొండ ఆలయాల్లో...

దొనకొండ: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పిలుపు మేరకు దొనకొండలోని అడ్డరోడ్డులో ఆనంద ఆశ్రమంలో శనివారం ఉదయం 9 గంటలకు పూజలు నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల మాజీ కన్వీనర్ కాకర్ల క్రిష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, జగనన్న, బూచేపల్లి అభిమానులు, ప్రజలు భారీగా పాల్గొనాలని కోరారు.

బాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు నేడు గుడిలో పూజలు

యర్రగొండపాలెం: పవిత్రమైన తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంపై తప్పుడు వ్యాఖ్యలు చేసిన సీఎం నారా చంద్రబాబు నాయుడు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి తెలిపారు. ఈ మేరకు స్థానిక మిల్లంపల్లి వేణుగోపాల స్వామి ఆలయానికి వెళ్లే దారిలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని, మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

అధికారులు బాధ్యతలు విస్మరిస్తున్నారు

- జెడ్పీటీసీ నాగిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి

కురిచేడు: అధికారులు బాధ్యతలు విస్మరించి వ్యవహరిస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు నుసుం వెంకట నాగిరెడ్డి మండిపడ్డారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో శుక్రవారం ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్పీటీసీ మాట్లాడుతూ మూడు నెలలకోసారి జరిగే సమావేశానికి కొందరు అధికారులు కిందిస్థాయి సిబ్బందిని పంపించి ఉద్దేశపూర్వకంగా డుమ్మా కొడుతున్నారని, వచ్చిన వారు కూడా బాధ్యతగా వ్యవహరించడం లేదని అన్నారు. సమావేశాలకు గైర్హాజరయ్యే అధికారులపై చర్యలకు కలెక్టర్‌కు రాయాలని ఎంపీడీఓకు సూచించారు. గత సమావేశాలలో సభ్యులు అడిగిన ప్రశ్నలు, లేవనెత్తిన సమస్యలను ఏం చేశారో చెప్పకుండా ప్రభుత్వం నుంచి తమ శాఖ ఇది ఇస్తుంది, అది చేస్తుందని తూతూమంత్రంగా చెప్పి ముగిస్తున్నారన్నారు. కొందరు అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా, కార్యక్రమాల సమాచారం ఇవ్వకుండా కార్యక్రమం ప్రారంభ సమయంలో ఫోన్‌లు చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవు పలికారు. మండలంలో ఇప్పటి వరకు వర్షాలు లేక పంటల సాగు ఆలస్యమైందని, ప్రస్తుతం వర్షాలు కురిసి పంటలు సాగుచేసేందుకు విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై సరఫరా చేయాల్సిన అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు కూడా చేయకుపోవడం దారుణమని అన్నారు. రేషన్ అక్రమ రవాణా నిత్యం జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని, భూ ఆక్రమణలు నిరంతరం కొనసాగుతున్నా వాటిపై చర్యలు శూన్యమని, అధికార యంత్రాంగం ఉన్నట్లా.? లేనట్లా..? అని ప్రశ్నించారు. మండలానికి ఒకే ఒక్క పశువైద్యశాల ఉందని, దానికి ఒక అదనపు డైరెక్టర్, ఒక డాక్టర్ పోస్టులు ఉన్నా ఒక్కరు కూడా అందుబాటులో ఉండటం లేదన్నారు. డాక్టరుకు ప్రమోషన్ వస్తే అదనపు డైరెక్టరు ఇష్టం వచ్చినప్పుడు వచ్చి సంతకాలు చేసి వెళ్తుంటాడని ఆయన తెలిపారు. సీజనల్ వ్యాధులకు వేయాల్సిన టీకాలు కూడా ఆన్‌లైన్‌లో వేస్తున్నారని, ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో పశువులకు వేయడం లేదని, దానిపై జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని ఆయన కోరారు. అందుకు మండల సమావేశానికి హాజరైన సిబ్బంది మండలంలో అన్ని పశువులకు గాలికుంటు టీకాలు వేశామని చెప్పగా.. పడమరవీరాయపాలెం ఎంపీటీసీ తాళ్లూరి నాసరమ్మ తమ పశువులకు టీకాలు వేయలేదని చెప్పారు. కాకి లెక్కలు చూపించి కాలక్షేపం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. వ్యవసాయ సీజనులో పశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన వారు అందుబాటులో లేకపోతే రైతులు ఇబ్బందులు పడతారని, ఆస్పత్రిలో అందుబాటులో ఉండే వైద్యులను నియమించాలని, ఈ విషయంపై పశువైద్యశాఖ డైరెక్టరేట్‌కు లేఖ రాయాలని ఎంపీడీఓను కోరారు. ఇప్పటికైనా అధికారులు తమ బాధ్యతలను గుర్తెరిగి వ్యవహరించి ప్రజలకు సేవ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుసుమకుమారి, ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు, వైస్ ఎంపీపీలు అన్నెం అరుణ, షేక్.కాశింబీ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారదర్శకత కోసమే సమాచార హక్కు చట్టం



సమాచార హక్కు చట్టం గురించి వివరిస్తున్న ఎంపీడీఓ కుసుమకుమారి

కురిచేడు: ప్రభుత్వ అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడానికి, అవినీతిని అరికట్టేందుకు సమాచార హక్కు చట్టం ఉపయోగపడుతుందని ఎంపీడీఓ కే కుసుమకుమారి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో వ్యవసాయాధికారి పి.మధుబాబు అధ్యక్షతన గురువారం సాయంత్రం సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కుసుమకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించడం, పరిమిత ధన వనరులను సమర్థవంతంగా వినియోగించడానికి ఈ చట్టం ఉపకరిస్తుందని ఆమె తెలిపారు. ఆర్‌టీఐ కమిషనర్ చావలి సునీల్ ఉత్తర్వుల మేరకు కమిషనర్ డైరెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండలస్థాయి అధికారులకు, రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి పీ మధుబాబు తెలిపారు. ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.65 వేల విరాళం



విరాళాన్ని అందిస్తున్న మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు

మార్కాపురం: విజయవాడ వరద బాధితులకు మార్కాపురం మెడికల్ అసోషియేషన్ తరుపున 65 వేల రూపాయల విరాళాన్ని అసోసియేషన్ కార్యదర్శి వేమూరి సుబ్బారావు, ట్రెజరర్ సతీష్‌కు అందించినట్లు అధ్యక్షుడు శ్రీనివాసరావు, కోశాధికారి ప్రసాద్ తెలిపారు. వరదల్లో నష్టపోయిన వారికి తమవంతు సాయంగా ఈ విరాళాన్ని అందించినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు



పెద్దవరంలోని 346 సర్వే నంబర్‌లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

కురిచేడు: మండలంలో ఎవరైనా ప్రభుత్వ భూములు సాగుచేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ జీ రజనీకుమారి హెచ్చరించారు. మండలంలోని పలుచోట్ల భూములు అన్యాక్రాంతం అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆమె తెలిపారు. తాజాగా మండలంలోని పెద్దవరం గ్రామ సర్వే నంబర్ 346లో పూర్తి విస్తీర్ణం 74.10 ఎకరాలు కాగా, దానికి కొందరు పట్టాలు చూపుతున్నారు. అలాగే ఇద్దరు తమకు పట్టాలు ఉన్నాయంటూ ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ తరుణంలో వారి పట్టాలు ప్రభుత్వం ఇచ్చినవా? లేక నకిలీవా అనే కోణంలో విచారిస్తున్నామని తహసీల్దార్ తెలిపారు. ప్రస్తుతానికి ఆ భూమిలో ఎవరూ సాగుచేయకూడాదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. అంతేగాకుండా పెద్దవరం గ్రామంలో టాంటాం ద్వారా గ్రామస్తులకు ఈ విషయాన్ని తెలియజేశామని తహసీల్దార్ తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ భూముల ఆక్రమణకు ప్రయత్నిస్తే తనకు తెలియజేయాలని మండల ప్రజలకు ఆమె తెలిపారు. వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

మెరుగైన సేవలే లక్ష్యం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసరావు

దర్శి: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని నూతనంగా బాధ్యతలు చేపట్టిన విద్యుత్ శాఖ ఈఈ పాలగిరి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఈఈ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. లో ఓల్టేజీ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఓవర్ లోడు ఎక్కడ ఉందో పరిశీలించి సమస్యను అధిగమిస్తామన్నారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అధికారులు కూడా వినియోగదారులు వచ్చిన వెంటనే స్పందించి సేవలు అందించడంలో నిమగ్నం కావాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న సర్వీసులను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఎత్తు తక్కువలో ఉన్న విద్యుత్ లైన్లకు మార్పులు చేసి పైకి బిగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు క్రాస్‌ల వద్ద వేలాడుతున్న తీగలకు మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా అధిగమించాలని సూచించారు. ఎక్కడైనా డ్యామేజీ ఉంటే వెంటనే గుర్తించి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. విలేకరుల సమావేశంలో ఏఈ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఎన్‌ఎంల ఆన్‌లైన్ సేవలు బంద్



ఎంపీడీఓ కుసుమకుమారికి వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఏఎన్‌ఎంలు

కురిచేడు: మండలంలోని గ్రామ సచివాలయాలలో పనిచేసే ఏఎన్‌ఎంలు నేటి నుండి ఆన్‌లైన్ వర్క్ నిలిపివేస్తున్నట్లు ఎంపీడీఓ కుసుమకుమారికి శుక్రవారం నోటీసు అందజేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఉద్యోగంలో చేరి వైద్యాధికారి పర్యవేక్షణలో తాము విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కానీ, ఆచరణలో మాత్రం సచివాలయం పనులు, ఆరోగ్య కార్యకర్త పనులు చేయిస్తున్నారని తెలిపారు. ఒకే సమయంలో రెండు శాఖల పనులు చేయడం కష్టంగా ఉన్నందున ఒత్తిడి పెరిగి మానసికంగా, శారీరకంగా రోగగ్రస్తులం అవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమను మాతృశాఖకు బదిలీ చేసి ఆరోగ్య కార్యకర్త విధులు నిర్వహించేలా మార్గనిర్దేశకాలు ఇవ్వాలని ఎంపీడీఓను కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు జి.బాలమరియమ్మ, బి.నాగమణి, కే అనిత, వి.పద్మావతి, వి.హరిత, కే కోటేశ్వరమ్మ, షేక్.పర్వీన్, షేక్.కాశింబీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఎంఈఓ, లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ సభ్యులు

దర్శి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎంఈఓలు కాకర్ల రఘురామయ్య, రమాదేవి సూచించారు. స్థానిక క్రిస్టియన్ పాలెం పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామయ్య, రమాదేవి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి ఆదర్శంగా నిలవడం అభినందనీయమన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యతని చెప్పారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ అధ్యక్షుడు టీ ఫణిబాబు, సెక్రటరీ పీవీ సత్యనారాయణ, గుప్తా, ట్రెజరర్ టీ అశోక్, క్లబ్ సభ్యులు జీ శ్రీధరరావు, బీ నాగార్జునరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఎస్.హైమావతి, ఎస్‌కే షరీఫ్, వెంకటేశ్వర్లు, శ్రీను, పూర్ణిమ, స్రవంతి, ప్రసూనాంబ, షరా, హజరత్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపల్లి గ్రామపంచాయతీ, దరిశి మండలం, ప్రకాశం జిల్లా

టెండర్–కం–బహిరంగ వేలం ప్రకటన

ఆర్.ఓ.సి నెం - 12/2024 తేది : 27-09-2024

ప్రకాశం జిల్లా దరిశి మండలం రాజంపల్లి గ్రామపంచాయతి పరిధిలో గ్రామ పంచాయతీ చేపల చెరువు లో చేపలు వేసి పెంచి పట్టుకొనుటకుగాను **2024–2025, 2025–2026** మరియు **2026–2027** అనగా మూడు సంవత్సరములకు టెండర్–కం–బహిరంగ వేలం తేదీ **07-10-2024**న ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు శ్రీయుత జిల్లా పంచాయతి అధికారి వారి సమక్షంలో లేదా వారి అనుమతి పొందిన వారి సమక్షంలో రాజంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం (సచివాలయం) వద్ద టెండర్–కం–బహిరంగ వేలం పద్ధతి ద్వారా జరుపబడును.

షరతులు

1. రాజంపల్లి గ్రామ సచివాలయం వద్ద ఆదే రోజు **రూ 1000/-లు** చెల్లించి ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల లోపు టెండర్ ఫారం పొందవలెను. 2. పూర్తి చేసిన టెండర్ షెడ్యూలు ఫారం ఆదేరోజు మధ్యాహ్నం 1.00 గంటల వరకు మాత్రమే స్వీకరించబడును. 3.సీల్డు టెండర్ కం షెడ్యూలు ఫారం తో **రూ 9,65,000/-లు** ఏదైన బ్యాంక్ నుండి పంచాయతి కార్యదర్శి, గ్రామపంచాయతి, రాజంపల్లి పేరు మీద డి.డి తీసి జతపరచవలెను. 4. బహిరంగ వేలములో పాల్గొనేవారు ధరావత్తు క్రింద **రూ 9,65,000/-లు** ముందుగా చెల్లించి వేలములో పాల్గొనవలెను. 5. టెండరు–కం వేలములో పాల్గొనువారు **రూ. 5,00,000** లకు సాల్వెన్సీ సర్టిఫికేటు సమర్పించవలెను. 6. ప్రభుత్వ మద్దతు ధర **రూ. 38,50,000/-** రాని యెడల టెండరు కం బహిరంగ వేలము వాయిదా వేయుటకు మరియు రద్దు పరచుటకు పంచాయితీకి పూర్తి అధికారము కలదు. 7. టెండరులోగాని లేదా బహిరంగ వేలములోగాని ఏది హెచ్చు మొత్తము అయినచో దానిని మాత్రమే స్వీకరించబడును. 8. పాటకు చెల్లించు ధరావత్తును చివరి సంవత్సరము కిస్తీలో జమచేసుకొనబడును. 9. టెండరు కం బహిరంగవేలంపాటలో వచ్చిన హెచ్చు మొత్తమును మూడు సమాన కిస్తీలుగా విభజించి ఏ సంవత్సరము కిస్తీ ఆ సంవత్సరము జూలై నెల మొదటి వారంలో చెల్లించి చెరువులో చేపపిల్లలను వేసుకొనవలెను. అట్లు చెల్లించనిచో వారి టెండరు కం బహిరంగ వేలం పాటను రద్దుచేసి తిరిగి వేలం పాటను నిర్వహించబడును. మరల జరుగు వేలం పాటలో తక్కువ మొత్తమునకు వచ్చిన ఎడల నష్టమును మొదటి పాటదారుని నుండి వసూలు చేయబడును. 10. రైతుల ప్రయోజనమునకు ఎటువంటి నష్టము కలిగించరాదు. 11. టెండరు కం బహిరంగ వేలంపాట జరిగిన 15 రోజులలో మొదటి సంవత్సరము కిస్తీ చెల్లించి పంచాయితీ వారికి స్టాంప్ మరియు రిజిస్ట్రేషన్ చట్టము ప్రకారం పంచాయితీ వారికి రిజిస్టర్ చేయవలెను. 12. ప్రకృతి వైపరీత్యముల వలనగానీ మరియు ఏ ఇతర కారణముల వలనగానీ చెరువులోని చేపలకు నష్టము కలిగినచో ఆ నష్టమునకు పంచాయితీ వారికి ఎటువంటి బాధ్యత లేదు. అన్నియు పాటదారుడే భరించవలెను. 13. ప్రకృతి వైపరీత్యముల వలన నష్టము వాటిల్లినచో వేలం కాలపరిమితి పొడిగించుటకుగాని సదరు మొత్తం వేలంపాట కిస్తీ రద్దుపరుచుటగాని వీలుపడదు. 14. వేలం యొక్క కాలపరిమితి 2024–2025, 2025–2026 మరియు 2026–2027 అనగా 3సంవత్సరములు అనగా **తేది 01.07.2024 నుండి 30.06.2027 వరకు** అనగా మూడు సంవత్సరములకు మాత్రమే. 15. ప్రకృతి వైపరీత్యముల వలన జరిగిన నష్టములకు గ్రామ పంచాయితీ ఎలాంటి నష్టపరిహారం చెల్లించదు. 16. కిస్తీని పూర్తిగా పంచాయితీ షరతులమేరకు చెల్లించి పంచాయితీ కార్యదర్శి గారి లిఖితపూర్వకమైన ఉత్తర్వులు పొంది చెరువులో చేపలను పెంచుకొనవలెను. 17. పంచాయితీకి బకాయిలు ఉన్నవారు వేలం పాటలో పాల్గొనుటకు అనర్హులు. 18. హెచ్చుపాటదారు ఇన్సూరెన్సు చేయించుకొనవలెను. 19. టెండరు షరతులు మిగతా వివరములు కార్యాలయము పనిచేయువేళలో వచ్చి తెలుసుకొనవచ్చును.

సం/- N.U.ప్రసన్న కుమార్
పంచాయతి కార్యదర్శి, ఫోన్ నెంబర్: 6281129005.

జిల్లా స్థాయి ఆటల పోటీలకు దోర్నాల విద్యార్థులు



జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైన విద్యార్థులు



జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన క్రీడల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికవడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 24వ తేదీ యర్రగొండపాలెంలోని క్రీడా ప్రాంగణం, 26 వ తేదీ దరిమడుగులో జరిగిన ఆటల పోటీల్లో పాఠశాలకు చెందిన 31 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారని అన్నారు. వీరు త్వరలో నిర్వహించే జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు రామానాయక్, హెచ్.రామానాయక్, నాగమూర్తి, విజమాణిక్యం, అనసూయదేవి తదితరులు అభినందనలు తెలిపారు.

జిల్లా స్థాయి క్రీడలకు విద్యార్థులు ఎంపిక

పెద్దారవీడు: మండలంలో ఏనుగులదిన్నెపాడు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 20 మంది విద్యార్థులు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు షేక్ అహ్మద్ శుక్రవారం తెలిపారు. మార్కాపురం మండలం దరిమడుగు గ్రామం సమీపంలో మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ పాఠశాలలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అండర్ 14 బాలుర విభాగంలో కబడ్డీ ఏడుగురు, అండర్ 17 బాలుర విభాగం కబడ్డీలో ఏడుగురు, అండర్ 14 బాలికల విభాగంలో ఖోఖోలో ఐదుగురు, అండర్ 17 బాలికల విభాగం ఖోఖోలో ఐదుగురు ఎంపికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందలు తెలిపారు.